తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# కాణిపాకం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించాలి

## -ఎమ్మెల్యే బాబుకు దళిత ఉభయదారుల వినతి



కాణిపాకం, జూలై 26 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం పాలకమండలి చైర్మన్ పదవిని ఈధపా ఎస్సీలకు కేటాయించాలని ఆలయ దళిత ఉభయదారులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబును కలసి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పాలకమండలి పదవీకాలం వచ్చే అక్టోబర్2తో ముగియనుండడంతో పలువురు ఆశావహులు చైర్మన్ పదవికోసం తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుత చైర్మన్ మోహన్‌రెడ్డి తన పదవీ కాలాన్ని మరో రెండేళ్ళు పొడిగించుకోవాలని ప్రయత్నాలు సాగిస్తుండగా, ఈదఫా చైర్మన్ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలని పలువురు ఆలయ ఉభయదారులు తమ వంతుప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే జయచంద్రారెడ్డి అలియాస్ చిన్నారెడ్డి, చిరగపల్లె రవిచంద్రారెడ్డిలు చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆలయ ఎస్సీ ఉభయదారులకు కేటాయించాలని ఎమ్మెల్యే బాబును బుధవారం కలసి విజ్ఞప్తి చేశారు. మాజీ ఎంపీపీ పుణ్యసముద్రం రవిప్రసాద్, కుమార్, కాణిపాకం రాజ్‌కుమార్,మూర్తి తదితరులు ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం అందజేశారు. శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని వడ్రాంపల్లెకు చెందిన చంద్రారెడ్డి తన అనుచరులతో కలసి బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఎంస్.బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఆలయ ఉభయదారుడిగా ఆలయ అభివృద్దికి తన వంతు సహకారం అందిస్తున్న ందున ఈదఫా చైర్మన్ పదవికి తనను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు.

# చినుకు పడితే చిత్తడి

## అండర్ గ్రౌండ్ విద్యుత్‌కేబుల్ పనులతో నాలుగుమాడావీధులు అస్తవ్యస్తం



శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త
పుణ్యక్షేత్రం సమస్యల మయంగామారింది. చినుకు పడితే చిత్తడి అన్నట్లు మారింది. అండర్ గ్రౌండ్ విద్యుత్‌కేబుల్ పనులతో నాలుగుమాడావీధులు అస్తవ్యస్తంగా మారాయి.ఆ కాంట్రాక్టర్ పనులు తీసుకున్న వేగంగా పనులు పూర్తి చేయటం లేదు. శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి శివరాత్రి పూర్తి అయిన వెంటనేచేపట్టి ఒకటి రెండు నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు.కానీ పట్టించుకోవటం లేదు. ఎక్కడైనా కేబుల్ ఏర్పాటుకు గుంత తవ్వితే నెలల తరబడి పూడ్చటం లేదు. అవసరం సమయంలో గుంతలు తవ్వుకుంటే సరిపోతుంది.రెండు రోజులుగా ముసార పట్టుకుంది, చిన్నపాటి తుంపర్లకే నాలుగుమాడావీదుల్లోని రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ముఖ్యంగా సూపర్‌బజార్ కూడలి, రామసేతు సర్కిల్,పెండ్లిమండపం, బేరివారి మండపం, తేరువీధిలోని పలు ప్రాంతాల్లో గుంతలు తవ్వి వదలి పెట్టారు. ఓ వైపు చిత్తడి చినుకులుమరో వైపు అధ్వాన్నంగామారిన రోడ్లతో జనం, వాహన చోదకుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.అండర్‌గ్రౌండ్ కేబుల్ కాంట్రాక్టర్ మాయతో రోడ్లు ధ్వంసం అయ్యాయి.

**రామసేతు వంతెన దుస్థితి:**



రామసేతు వంతెనపై నిలిచిన నీళ్ళు

బ్రిటిష్ ప్రభుత్వం నిర్మించిన రామసేత వంతెనను ఇటీవల వందసంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దేవస్థానం నిధులతో ఆధునీకరించారు.బిటి చేసి సర్వాంగసుందరంగా తీర్చి దిద్దారు.పనులు చేసిన కాంట్రాక్టర్లు వర్షపు నీరు నదిలో పడటానికి ఏర్పాటు చేసిన రంధ్రాలను మూసివేయటంతో నీళ్లు నిలిచి అస్తవ్యస్తంగామారింది. కాగా స్వర్ణముఖి ఆధునీకరణలో భాగంగా గ్రావెల్ చేసారు. చినుకులకు గుంతలమయంగా మారింది.

# గూడూరులో ప్రమాదకరంగా రోడ్లు

## గ్యాస్ పైపులైన్ కోసం తవ్వకాలు - అవస్థల్లో ప్రజలు





గూడూరు పట్టణంలో ధ్వంసమైన రోడ్లు

గూడూరు, జూలై 26 ప్రభాతవార్త
గూడూరు పట్టణంలో గ్యాస్ పైపులైన్ కోసం అడ్డగోలుగా తవ్వకాలు చేయడంతో ఏర్పడిన గుంటలో ప్రమాదకరంగా తయారయ్యాయి. పట్టణంలో గ్యాస్ పైపులైన్ కోసం బాగున్న రోడ్లను తవ్వేయడంతో గుంటలమయంగా తయారైంది. తవ్విన గుంటలను కాంట్రాక్టర్లు నామమాత్రంగా పూడ్చి వదిలేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వర్షాలు ప్రారంభం కావడంతో వర్షపు నీళ్ల ఈ గుంటలో నిండిపోయాయి. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల ద్విచక్ర వాహనంతో సహా ఇద్దరు వ్యక్తులు గుంటలో పడిపోయి తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లను ధ్వంసం చేస్తున్నారంటూ పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని చిన్న చిన్న వీధులను సైతం వదలకుండా రోడ్లను ధ్వంసం చేసి పెద్దఎత్తున గుంటలు తీశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం, చిన్న పిల్లలు వీధుల్లో తిరగాలంటేనే భయపడుతున్నారు. దీనిపై మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్న గూడూరు ఆర్డీఓ దృష్టి సారించి రోడ్లను ఒక్కసారి చూడాలని ప్రజలు కోరుతున్నారు.

### కమర్షియల్ రాకెట్ ప్రయోగానికి

# సర్వం సిద్ధం

## - షార్‌లో లాంచ్ రిహార్సల్స్ ప్రారంభం
## - ఇస్రో, సింగపూర్ శాస్త్రవేత్తలతో హుషార్



శ్రీహరికోట (తడ),
జూలై 26 ప్రభాతవార్త
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో పక్కా కమర్షియల్ రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 30న ఉదయం 6.30 గంటలకు పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి పంపుతున్నారు. డిఎస్-సార్ శాటిలైట్ ఇందులో ప్రధానమైనది. ఇది కాకుండా వెలాక్స్ ఎఎం, ఆర్కేడ్, స్కూబ్-2, నులియన్, గెలాసియా-2, ఓఆర్‌బి-12 ఉపగ్రహాలను ప్రయోగిస్తున్నారు. ఇందుకు సంబంధించి శ్రీహరికోటలో ఉదయం పూట రాకెట్ ప్రయోగాన్ని వీక్షించడానికి సందర్శకులను ఆహ్వానించారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా పలువురు పేర్లు నమోదు చేసుకున్నారు. పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్ పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో 58వది. శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదికపై లాంచ్ రిహార్సల్స్ కొనసాగుతున్నాయి. నాలుగు దశల పిఎస్ఎల్‌వి రాకెట్‌ను ఈ సారి స్ట్రాపాన్ బూస్టర్లు లేకుండా కోర్ అలాన్ తరహాలో రూపొందించారు. ప్రస్తుతం ఉపగ్రహాలను రాకెట్ శీర్షభాగంలోని హీట్ షీల్డ్ మధ్య అమర్చారు. ఈ నెల 28న లాంచ్ ఆథరైజేషన్ బోర్డు, మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశాలు నిర్వహించి ప్రయోగ సమయాన్ని నిర్ధారిస్తారు. అయితే ప్రస్తుతానికి 30న ఉదయం 6.30 గంటలకు ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రయోగం ద్వారా భారత్‌కు కమర్షియల్ లాభాలు ఆర్జించే అవకాశం ఉంది.

# ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాల ఘనత సిఎం జగన్‌దే

## రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
## ప్రపంచం సంక్షోభంలో ఉన్నా క్రమం తప్పక పథకాల్లో లబ్ది !!



మల్లానూరు బహిరంగసభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పంరూరల్, జూలై 26 ప్రభాతవార్త
ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర అటవీ,గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మల్లానూరులో మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ నేతృత్వంలో జరిగిన బహిరంసభలో మంత్రి ప్రసంగించారు. కోవిడ్ లాంటి సమయంలో ప్రపంచమంతా సంక్షోభం ఉనా ్న ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అమ్మఒడి, చేయూత, ఆసరా వంటి పథకాలు ప్రజలకు అందించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారన్నారు. అవసరమైన మందులు, టీకాలు, వైద్య సౌకర్యాలు కల్పించారన్నారు. కుల,మత,ప్రాంతాలకు అతీతంగా పేదరికాన్ని ప్రామాణికంగా తీసుకుని అర్హులకు పెన్షన్లు, ఇళ్లు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటికే ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసారన్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలు ఉండరాదనే లక్ష్యంతో దాదాపు 31.50లక్షల ఇళ్ల పట్టాలు మహిళల పేరిట అందించామన్నారు. 24లక్షల ఇళ్లు మంజూరు చేయగా 6లక్షల ఇళ్లు పూర్తయ్యాయన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు కార్పోరేట్‌కు ధీటుగా 3వతరగతి నుంచే ఆంగ్ల మాధ్యమం అందించడం జరుగుతోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పోరేట్ వైద్య సేవలను అందించడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఓ వైద్య కళాశాల నిర్మాణంకు సిఎం శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, పారా మెడికల్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ ద్వారా నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. అంతకుముందు వెండుగంపల్లి, నడిమూరు, మంకలదొడ్డి,పైపాళ్యం పంచాయతీల్లో మంత్రి పర్యటించారు. నడిమూరు, మల్లానూరులలో 25లక్షలు, మల్లానూరు2, మంకలదొడ్డిలో 40లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాలను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. పార్టీ శ్రేణులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. కార్య క్రమాల్లో చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, డా॥ సిపాయి సుబ్రమణ్యం, టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్, రెస్కో చైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి చైర్మన్ విద్యాసాగర్, రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ చైర్మన్ వనిత శ్రీను, ఎంపిపి అశ్విని, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ,వైస్ ఎంపిపి షౌకత్ అలీ, సర్పంచులు ధరా ్మచారి, శ్రీనివాసులు,సీనియర్ నేతలు కృష్ణమూర్తి, రెడ్డెప్ప, స్థానిక నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

# భరత్‌ని ముఖ్యమంత్రిని చేస్తారు ..

## బహిరంగసభలో మాట జారిన మంత్రి పెద్దిరెడ్డి

కుప్పంరూరల్, జూలై 26 ప్రభాతవార్త
ఈసారి కుప్పం ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపిస్తే ముఖ్యమంత్రిని చేస్తామని ఇదివరకే సిఎం జగన్ ప్రకటించారు.. కాదు మంత్రిని చేస్తారు అని రాష్ట్ర అటవీ,గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నోరు జారారు. మండలంలోని వెండుగంపల్లిలో జరిగిన సభలో మంత్రి తొలుత భరత్‌ను ముఖ్యమంత్రి చేస్తామని తర్వాత మంత్రిని చేస్తామని చెప్పి మాటను సవరించుకున్నారు. ఈవ్యాఖ్యలు సోషియల్ మీడియాలో వైరల్ కావడం గమనార్హం.

# ఆగష్టు 15 లోపు ఆర్ట్ స్టూడియో పనులు పూర్తి చేయండి



తిరుపతి కార్పొరేషన్, జులై 26, ప్రభాతవార్త
ఆగష్టు 15 లోపు ఆర్ట్ స్టూడియో పనులు పూర్తి చేయాలని అధికారులను తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. బుధవారం తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డితో కలిసి ఇందిరా మైదానం ఎదురుగా స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఆర్ట్ స్టూడియా పనులను, ఇండోర్ ఆడిటోరియం పనులను కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ ఆర్ట్ స్టూడియోలో జరుగుతున్న పనులను డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డికి వివరించారు. 41 కోట్ల రూపాయల స్మార్ట్ సిటీ నిధులతో ఈ ఆర్ట్ స్టూడియో నిర్మిస్తున్నామని ఇందులో 600 మంది కూర్చునేందుకు వీలుగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆడిటోరియం, డిజైనింగ్ స్టూడియో, పోటో గ్యాలరీ రూమ్, ఒక కాన్ఫరెన్స్ హాల్, రెండు గెస్ట్ రూమ్‌లు ఉంటాయన్నారు. మిగిలిన పనులు ఆగష్టు 15 లోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్లు మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఈలు దేవిక, మోహన్, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికి సంక్షేమ ఫలాలు తీసుకువచ్చిన ఘనత జగనన్నదే

## డిప్యూటీ సీఎం నారాయణస్వామి



వెదురుకుప్పం,జూలై 26 ప్రభాతవార్త :
అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందజేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. మండలంలోని పచ్చికాపల్లం సచివాలయం పరిధిలో బుధవారం సర్పంచ్ కుమారి, ఎంపీటీసీ పుష్పల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన లబ్ధిదారుల సంక్షేమ ఫలాల ప్రయోజనాల లబ్ధిని వివరిస్తూ ప్రభుత్వం తయారు చేసిన కరప్రతాలను గడప గడపకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, ఎంపీపీ నాగరాణి, జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి బండి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, నాయకులు బట్టే సుబ్రమణ్యం, రోసు రెడ్డి, బోజ్జా రెడ్డి, రవికుమార్ రెడ్డి, నరేష్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ధనంజేయులు రెడ్డి, ఎంపిడివో సుధాకర్‌రావు, తహాశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎపియం కవిత, ఎపివో ఇందు, ట్రాన్స్‌కో ఏఇ రామాంజనేయులు,హౌసింగ్ ఏఇ వృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన 71 క్లైములకు

# రూ. 4.07 కోట్లు ఆమోదం

## జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి



తిరుపతి కలెక్టరేట్, జులై 26, ప్రభాతవార్త
పిఎంఈజిపి రుణాలను లక్ష్యాల మేరకు సకాలంలో గ్రౌన్డింగ్ చేయాలని, పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు నిబంధనల మేరకు అమలు చేయాలని, తదనుగుణంగా సంబంధిత అధికారులు తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉపాధి కార్యక్రమం సమీక్షిస్తూ లబ్ధిదారుల దరఖాస్తులు అందిన వాటిని అర్హత మేరకు సత్వరమే యూనిట్లు మంజూరు, పెండింగ్ దరఖాస్తుల గ్రౌన్డింగ్ చేయాలని, ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించబడిన లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళిక బద్ధంగా పని చేయాలని, ఎల్‌డిఎం వాటికి అనుబంధ బ్యాంకులు లోన్లు ఇచ్చేలా సత్వరమే గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ 2023 నుండి 255 పరిశ్రమలకుగాను 224 అనుమతులు ఇచ్చామని మరో 28 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 71 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ. 4.07 కోట్లు అందించడానికి నేడు ఆమోదం తెలిపారు. పెట్టుబడి సబ్సిడి 19, విద్యుత్ సబ్సిడి 23, వడ్డీ రాయితీ 22, సేల్స్ టాక్స్ 5, స్టాంప్ డ్యూటీ 2 యూనిట్లకు ఆమోదించారు. క్లస్టర్ అధివృద్ధి కార్యక్రమం ఏర్పేడు మండలం మధవమాల కింద ఫుడ్ కార్వింగ్ క్లస్టర్, కాపర్ వేజెల్స్ క్లస్టర్ ఎర్రమరెడ్డి పాలెం, రేణిగుంట మండలం, వెంకటగిరి శారీ ప్రింటింగ్, డైయింగ్ క్లస్టర్, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యలు పురోగతిపై సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమలు భద్రత ప్రమాణాలు అమలు చేయాలని, ప్రమాదాల నివారణకు తరచూ సంబంధిత అధికారులు సేఫ్టీ మెజర్మెంట్‌పై అవగాహన కల్పించి తప్పని సరిగా నిబంధనల మేరకు అమలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ రెడ్డి వివరిస్తూ గత నెల సమావేశం నుండి నేటికి 10 పరిశ్రమల తనిఖీలు చేశామని, మరిన్ని తనిఖీలు చేసి పరిశ్రమల భద్రత ప్రమాదాలు అమలు అయ్యేలా చర్యలు చేపడతామని తెలిపారు. పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు వివిధ శాఖల అధికారుల వద్ద ఉన్న పెండింగ్ అంశాలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపిఐఐసి తిరుపతి చంద్రశేఖర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్, సహాయ కమిషనర్, కార్మిక శాఖ కృష్ణారెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య తదితర అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా శ్రీవారి పల్లవోత్సవం





**తిరుమలలో బుధవారం రాత్రి జరిగిన పల్లవోత్సవంలో శాస్త్రోక్తంగా అర్చకులు పూజాది కార్యక్రమాలు, ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.** ప్రభాతవార్త-తిరుమల

## సహ ఉద్యోగిని ఆదుకొన్న నగరి డివిజన్ పోలీసులు

### - కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కానిస్టేబుల్‌కు రూ.1.90 లక్షలు వితరణ




పాలసముద్రం, జులై 26 ప్రభాతవార్త:

రోజు తమతో కలిసి విధులకు హాజరవుతూ ఉత్సాహంగా వుంటే ఓ కానిస్టేబుల్ అనారోగ్య సమస్యతో ఆసుపత్రి మంచంపై పడుకోవడంతో పోలీసుల మనస్సు చలించింది. తోటి సహ ఉద్యోగికి తోచిన సహాయం చేసి ఆదుకోవాలని పోలీసులు భావించి తలో చేయి కలిపారు. అనారోగ్యంకు గురైన కానిస్టేబుల్ చికిత్సకు అవసరమైన మొత్తం పూర్తిగా సమకూర్చకపోయినప్పటికీ తమ చేతనైన మేరకు అందరు కలిసి ఆర్థిక సహాయం అందించి మానవతాదృక్పదంను చాటుకొన్నారు. ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.ఆనంద్‌బాబు కిడ్నీ సమస్యతో దీర్ఘకాలంగా బాధపడుతున్నాడు. కిడ్నీ సమస్యతో ఆసుపత్రిలో చేరిన కానిస్టేబుల్ ఆనంద్‌బాబుకు డాక్టర్లు ఆపరేషన్ ఖర్చు 12 లక్షలు ఖర్చు అవుతాయని పేర్కొన్నారు. అంత మొత్తంలో ఆపరేషన్ ఖర్చులు సమకూర్చుకోవడం కానిస్టేబుల్ కుంటుంబానికి తలకుమించిన భారంగా మారింది. ఆ సమయంలో నగరి పోలీస్ సబ్ డివిజన్ అధికారి డిఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో నగరి సబ్ డివిజన్ పోలీసులు అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తమ సహోద్యోగి బి.ఆనంద్ బాబుకు చేతనైన మేరకు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు నగరి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు తమ శక్తి మేరకు ఆనంద్‌బాబు ఆపరేషన్‌కు నిధులు అందజేశారు. ఈ మేరకు నగరి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు కానిస్టేబుల్ ఆనంద్‌బాబు చికిత్స కోసం 1.90 లక్షల రూపాయలు సేకరించారు. డిఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరం ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్‌తో పాటు ఎస్ఆర్ పురం ఎస్ఐ షెక్షావలీ, కార్వేటినగరం ఎస్ఐ దస్తగిరి, పూతలపట్టు ఎస్ఐ సురేష్‌ల ఈ మొత్తంను పాలసముద్రం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆనందబాబు భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరి సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బంగారుపాళ్యంలో పీర్ల పండుగ



బంగారుపాళ్యం, జులై 26 ప్రభాతవార్త:

మండల కేంద్రం బంగారుపాళ్యంలో ఘనంగా పీర్ల పండుగ ప్రారంభమైంది. సోమవారం సాయంత్రం నుండి పీర్ల పండుగ ఉత్సవాలను ముస్లీం, హిందు సోదరులు చేపట్టారు. బుధవారం సాయంత్రం పీర్ల చావడిలో పీర్ల స్థాపన, రాత్రి ఇమాం ఖాసీం పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవానికి బంగారుపాళ్యం సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి ఉభయదారులుగా వ్యవహరించారు. బంగారుపాళ్యం మాజీ జమీందారు సుబ్బరామరాజా ఆధ్వర్యంలో ఈ పీర్ల ఉత్సవాలు జరుగుతున్నాయి. ప్రతి రోజు అధిక సంఖ్యలో హిందు, ముస్లీం సోదరులు పీర్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకొంటున్నారు.

## కుప్పంలో రోడ్లపై వరినాట్లు వేసిన తెలుగు తమ్ముళ్లు



కుప్పం, జూలై 26 ప్రభాతవార్త

కుప్పం పట్టణం బైపాస్ రోడ్‌లో తెలుగుదేశం పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్వర్యంలో తెదేపా నేతలు నడిరోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నాలుగన్నర ఏళ్లుగా దెబ్బతిన్న రోడ్లకు తట్టమట్టి వేయకుండా వైకాపా నేతలు గాలికి వదిలేశారని విమర్శించారు. దీంతో తేలికపాటి వర్షాలకే రోడ్లు నీటితో నిండి చెరువులను, పంటపొలాలను తలపిస్తున్నాయన్నారు. దీంతో తాము రోడ్డుపై వరినాట్లు వేసినట్లు పేరొ కన్నారు. కార్యక్రమంలో నేతలు సత్యేంద్రశేఖర్, త్రిలోక్, కాణిపాకం వెంకటేష్, కన్నన్, ఆర్ముగం, ఆర్ఆర్ రవి, మంజునాథ్, డివి భాస్కర్, సతీష్, నరేష్, తిరుమగళ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

తవణంపల్లె, జూలై 26 ప్రభాతవార్త:

మండలంలోని మోదలపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులకు 'కొత్తకోట రాజ్‌కుమార్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. మండలంలోని పొన్నేదుపల్లెకు చెందిన యాగమూర్తి కుమారుడు రాజ్‌కుమార్ యాదవ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈట్రస్ట్ ద్వారా దిగువ మోదలపల్లె పంచాయతీ పరిధిలోని పొన్నేదుపల్లె ఉర్దూ, పొన్నేదుపల్లె ఎస్సీ వాడ, వడ్డిపల్లె, దిగువ మోదలపల్లె ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. వీటిని ఎంఈఓ హేమలత చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో రాజ్‌కుమార్ కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోదగుట్టపల్లిలో వివాదాస్పద భూమిపై అధికారుల సర్వే



కుప్పంరూరల్, జూలై 26 ప్రభాతవార్త

మండలంలోని బోదగుట్టపల్లిలో సర్వే నెం 9/3లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయిందని గ్రామస్తులు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో తహశీల్దార్ పార్వతి ఆదేశాలతో బుధవారం విఆర్వో, సర్వేయర్లు బుధవారం భూముల సర్వే చేపట్టారు. సర్వే నివేదికను తహశీల్దార్‌కు అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నేత రాజ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలి

### -ఎమ్మెల్యే వెంకటేగౌడు



పెద్దపంజాణి జూలై26 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమఫలాలు ప్రతిఒక్కరికి అందించడమే తమలక్ష్యమని పలమనేరు ఎమ్మెల్యే డా॥ఎన్.వెంకటేగౌడు పేర్కొన్నారు.బుధవారం స్థానిక సర్పంచులు నర్మదానగేష్,శిరీషానాగశంకర్ రెడ్డి,వైకాపా జిల్లా కార్యదర్శి ఎ.తమ్మిరెడ్డి ఆధ్వర్యంలో రాజుపల్లి పంచాయతీ పరిధిలోని మిట్టపల్లి,కరసనపల్లి,కమ్మినాయునిపల్లి,రాజుపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే డా॥ఎన్.వెంకటేగౌడు గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంను చేపట్టారు.ఈ సందర్భంగా 822గృహాలను సందర్శించి వైకాపా ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాసంక్షేమపథకాలు అందుతున్నాయా! లేదా! అని అడిగితెలుసుకుని లబ్దిదారులకు నేరుగా కరపత్రాలను అందజేశారు. గతంలో చంద్రబాబు నాయుడు సిఎంగా ఉన్నప్పుడు ఇచ్చినహామీలను గాలికివదిలేశారని విమర్శించారు. అర్హులు ఇంకాఎవరైనా ఉంటే వారికితప్పక ప్రభుత్వసంక్షేమపథకాల్లో లబ్దికలిగేందుకు తగుచర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డెప్ప,జెడ్పీటిసి సుష్మాకీర్తి,వైకాపా మండల కన్వీనర్ బాగారెడ్డి,వైస్ ఎంపిపిలు అంజమ్మ,జిడి.బాబు,మండల జెసిఎస్ కన్వీనర్ పృధ్వీనాథ్,సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్,ఏఎంసి డైరక్టర్ సురేష్,ఎంపిటిసి కృష్ణప్ప,మండలస్థాయి అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి - జాయింట్ కలెక్టర్

శాంతిపురం/వి.కోట, జూలై 26 ప్రభాతవార్త

బూత్ లెవెల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం వి.కోట, శాంతిపురం మండల బిఎల్ఒలతో ఓటర్ల జాబితా తయారీపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఎల్ఒలు ఇంటింటికెళ్లి 6,7,8 ప్రొఫార్మాలను పరిశీలించాలన్నారు. అర్హులైన ఓటర్లను తొలగించడం, అనర్హుల జాబితాల్లో చేర్చడం, ఎవరో చెబితే ఓట్లు తొలగించడం, చేర్చడం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బిఎల్ఒలు తమ ఇళ్లకు రాలేదని ఎవరు చెప్పినా చర్యలు తీసుకుంటామన్నారు. బిఎల్ఒలు పరిశీలనకు వెళ్లినపుడు వాలంటీర్లు వెంట ఉండరాదని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లు ఉండవచ్చన్నారు. ప్రతి శనివారం పరిశీలన చేసిన ఓటర్ల జాబితాలను బిఎల్ఒలు వార్డు, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ శివయ్య, తహశీల్దార్లు శ్రీనివాసులు, చిట్టిబాబు, ఎంపిడిఒలు హేమమాలిని, వినోద, బిఎల్ఒలుపాల్గొన్నారు.

## జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు

### -జిల్లా వైకాపా కార్యదర్శి తమ్మిరెడ్డి.



పెద్దపంజాణి జూలై26 ప్రభాతవార్త :

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వైకాపా కార్యదర్శి ఎ.తమ్మిరెడ్డి పేర్కొన్నారు.బుదవారం మండలంలోని రాజుపల్లి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ నర్మదానగేష్,ఎంపిడిఓ ఆధ్వర్యంలో నిర్వహించారు.పలువురికి ఉచితంగా ధృవీకరణ పత్రాలను అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా 11 రకాల ఉచిత సేవలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నేతలు పూల శంకర్‌రెడ్డి,ఎంపిటిసి కృష్ణప్ప,సచివాలయ సిబ్బంది,గృహసారథులు, పంచాయతీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు గిట్టుబాటు ధర కోసమే అమూల్ సంస్థతో ఒప్పందం - జాయింట్ కలెక్టర్

శాంతిపురం/రామకుప్పం/వి.కోట, జూలై 26 ప్రభాతవార్త



పాడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం అమూల్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం శాంతిపురం, రామకుప్పం,వి.కోటలో జరిగిన పాల వెల్లువ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా సహకార సంస్థ సహకారంతో ఇటీవల చిత్తూరులో అమూల్ పాల డెయిరీని ప్రారంభించారన్నారు. రైతులు అమూల్ సంస్థకు పాలుపోసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న చేయూత, ఆసరా పథకాల లబ్దిదారులు పాడి ఆవులు కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ డెయిరీలకు ఉన్న తేడాలను వివరించాలన్నారు. ఇప్పటికే అమూల్ డెయిరీ పాల ధరలు ఆరుసార్లు పెంచిందన్నారు. వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి పాడి ఆవులు కలిగిన వారిని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పిడి తులసి, ఆర్డీఓ శివయ్య, డిపిఓ లక్ష్మి, డిసిఓ బ్రహ్మానందరెడ్డి, డిడిఓ రవిచంద్ర, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, కార్యదర్శులు, విఆర్వోలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

## ప్రభావశీలురగుర్తింపు కమిటీ సభ్యుడిగా భీమినేని చిట్టిబాబు

పాలసముద్రం, జులై 26 ప్రభాతవార్త:



ప్రభావశీలుర గుర్తింపు కార్యక్రమం కమిటీ సభ్యుడిగా పాలసముద్రం మాజీ జడ్పీటిసీ భీమినేని చిట్టిబాబును నియమిస్తూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ప్రభావశీలులను గుర్తించడానికి జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నలురుగు సభ్యులను ఎంపిక చేసింది. ఈ నలురుగు సభ్యులల్లో పాలసముద్రం మాజీ జడ్పీటిసీ భీమినేని చిట్టిబాబు ఒకరు. ఈ కమిటీ సభ్యులకు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీలు, పార్లమెంటు పార్టీ అధ్యక్షులు పూర్తి సహకారం అందించాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## డీఎంఅండ్‌హెచ్‌ఓచే పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

తవణంపల్లె, జూలై 26 ప్రభాతవార్త:



జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ప్రభావతి బుధవారం తవణంపల్లె పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో కాన్పులు ఎక్కువగా జరిగే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రతి రోజూ పీహెచ్‌సీకి ఎంత మంది రోగులు వస్తున్నారు?వారికి ఏవిధంగా చికిత్సలు అందిస్తున్నారని వాకబు చేశారు.అలాగే మండలంలోని గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, ఎంటమాలజిస్ట్ శ్రీవాణి, పీహెచ్ఎన్ భారతమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓట్ల రాజకీయాలకోసం కులాల మధ్య చిచ్చుపెట్టొద్దు.

### - మాలమహానాడు రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ కెలవాతి సుబ్రమణ్యం.

పెద్దపంజాణి జూలై26 ప్రభాతవార్త :

రాజకీయ పార్టీల నేతలు ఓట్ల రాజకీయాలకోసం ఎస్సీ కులాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే సహించేదిలేదని మాలమహానాడు రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ కెలవాతి సుబ్రమణ్యం పేర్కొన్నారు.బుదవారం ఆయన పెద్దపంజాణిలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు.ఎస్సీ కులాల్లో ఎన్ని ఉప కులాలు ఉన్నాయో తెలియని నాయకుల సైతం వర్గీకరనకు మద్దతు తెలుపుతామని పేర్కొనడం దారుణమన్నారు.ఇటీవల రాష్ట్రంలో కొత్తగా పార్టీని బిసివై పార్టీని ప్రకటించిన బోడే రామచంద్ర యాదవ్ ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తామని పేర్కొనడం తగదన్నారు.అన్నదమ్ములాంటి మాల,మాదిగలను విడదీసే ప్రయత్నం చేస్తే రాష్ట్రంలోని మాలలు తగు బుద్ది చెబుతారని పేర్కొన్నారు.గతంలో ఎస్సీల జోలికొచ్చిన పార్టీలు కనుమరుగైపోయాయన్నారు.మాలల జోలికి వస్తే వర్గీకరణ గురించి ఎవరైనా మాట్లాడితే రాష్ట్రంలో ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## గూడూరు తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థిగా పాశం సునీల్ కుమార్‌ని ఎంపిక చేయడంపై హర్షం

### రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి



చిల్లకూరు, జులై 26, ప్రభాతవార్త

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గూడూరు తెలుగు దేశం పార్టీ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాశం సునీల్‌కుమార్‌ను ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమని రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి హర్షం వ్యక్తం చేసారు. బుధవారం చిల్లకూరు మండలంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సునీల్ కుమార్ గూడూరు మున్సిపల్ చైర్మన్‌గా రాజకీయ ప్రవేశం చేసి 2014 - 19 మధ్య గూడూరు శాసన సభ్యులుగా గెలుపొంది ఎవరూ చేయని విధంగా కోట్లాది రూపాయిలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో పాశం సునీల్ కుమార్‌ని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. నియోజకవర్గంలోని తెలుగు దేశం పార్టీ ఓటర్లు, కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పని చేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.

## పేద అర్చక కుటుంబానికి ఆర్థిక చేయూత

వాకాడు, జులై 26, ప్రభాతవార్త



వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రకాశం జిల్లా కొండేపి మండలం గుర్రప్పడియ గ్రామంలోని శ్రీకోదండరామాలయం అర్చక స్వామి అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న దీవి శ్రీనివాసాచార్యులు అనే అర్చకునికి రుక్మిణమ్మ దాతృత్వంతో సంస్థ ప్రతినిధి తిరుపతి జిల్లా అర్చక సలహా మండలి సభ్యులు దీవి అనంతబాబు 30 వేల రూపాయలను అందించారు. కొండేపి మండల అర్చక నాయకులు, స్థానిక పురోహితులు పరాంకుశం నాగార్జునాచార్యులు చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అర్చక కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన దాత రుక్మిణమ్మకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వాకాణి హేమంత్ కుమార్, సరళ, విజయ, వంశీ ప్రియ, షణ్విత తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షలో 2000 మందికి సర్టిఫికెట్లు పంపిణీ

వాకాడు, జులై 26, ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల్లో భాగంగా జగనన్న సురక్షలో పేద బడుగు బలహీన వర్గాలకు 2000 మంది పైగా 11 రకాల సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వాకాడులోని ఒకటి, రెండవ సచివాలయం పరిధిలోని షాది మంజిల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గోపినాథ్, తహశీల్దార్ నరసింహారావు, ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏఎంపి చైర్ పర్సన్ నాగభూషణమ్మ, సర్పంచి బండి వెంకటరత్నమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తడలో జిల్లా పంచాయతీ అధికారి పర్యటన

తడ, జూలై 26 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా పంచాయతీ అధికారి ఎ.రాజశేఖర్‌రెడ్డి బుధవారం తడ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా తడ గ్రామ పంచాయతీకి ఆయన వచ్చి ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆరా తీశారు. స్థానిక సర్పంచ్ కె.ఆర్ముగం పంచాయతీ అధికారిని సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. పారిశ్రామికంగా ఎదుగుతున్న తడలో కనీస సౌకర్యాలు కల్పించడానికి తగినన్ని నిధుల్లేవని ఈ సందర్భంగా సర్పంచ్ డిపిఓకి వివరించారు. మండల పరిధిలోని పలు పంచాయతీల్లోను అభివృద్ధి కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయన్న దానిపై డిపిఓ స్థానిక అధికారులు, కార్యదర్శులతో మాట్లాడారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం, జూలై 26 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ఏకొల్లు సర్పంచ్ ఆవుల బ్లెస్సీ, ఆమె భర్త ఆవుల అనిల్‌కుమార్‌లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు, చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డికి ఘన స్వాగతం పలికారు. తెనాలి బ్యాండ్లు, బాణాసంచా వేడుకలతో



కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడి నుంచి గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు వైసీపీ నాయకులు వేణుంబాక మున స్వామినాయుడు, సురేష్‌రెడ్డి, జడ్పీటీసీ రమేష్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెంచురాఘవరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే

కోట,జులై 26 ప్రభాతవార్త



కోట మండలం సిద్దవరం సొసైటి మాజీ ఛైర్మన్ ,సినియర్, వైకాపా నాయకులు,సన్నారెడ్డి చెంచు రాఘవరెడ్డిని గూడూరు శాసన సభ్యులు డాక్టర్, వెలగపల్లి వర ప్రసాద్‌రావు పరామర్శించారు. చెంచు రాఘవ రెడ్డి సోదరుడు సిద్దవరం సొసైటి మాజీ ఛైర్మెన్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న శాసన సభ్యులు వర ప్రసాద్‌రావు కర్లపూడి గ్రామంలోని చెంచురాఘవరెడ్డి నివాసం వేళ్లారు. అక్కడ నుంచి శ్రీనివాసులురెడ్డి నివాసం వేళ్లి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్ళిరించారు. అనంతరం చెంచురాఘవరెడ్డిని పరామర్శించారు. ఇంకా పలువురు నాయకులు రాఘవరెడ్డిని పరామర్శించారు.

## వాసవి వనితా క్లబ్‌చే నోట్‌బుక్స్ పంపిణీ

సూళ్లూరుపేట, జూలై 26 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీవాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పి.గాయత్రి ఆదేశాల మేరకు బుధవారం విద్యాసేవ, ప్రకృతిసేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని శ్రీబాలయోగి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ప్రకృతి సేవలో భాగంగా మొక్కలను పంపిణీ చేసి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వనితా క్లబ్ ప్రెసిడెంట్ సునీత, కార్యదర్శి కళావతి, కోశాధికారి శైలజ, జోన్ ఛైర్మన్ సాయిరామ్, ప్రిన్సిపాల్ గురుప్రసూన, వాసవి వనితా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ కింద గుంటలో పడి యువకుడు మృతి

తడ, జూలై 26 ప్రభాతవార్త

తడ పంచాయతీ పరిధిలోని ఆదిత్యానగర్‌లో ఒక అపార్ట్‌మెంట్ లిఫ్ట్ కింద గుంటలో పడి యువకుడు మృతిచెందినట్లు బుధవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు అందింది. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూడి ప్రాంతానికి చెందిన జానకిరామన్ అలియాస్ జాని (27) స్థానికంగా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, మూడురోజులుగా కనిపించకపోవడంతో వెతుకుతున్నామని ఆయన సోదరుడు బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అతను మృతిచెందిన ప్రాంతానికి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాలకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నారు. తడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంగన్‌వాడీ సిబ్బంది విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

### - వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, జులై 26, ప్రభాతవార్త:



నూతనంగా నియమితులైన అంగన్‌వాడీ సిబ్బంది విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నూతనంగా నియమితులైన అంగన్‌వాడీ వర్కర్స్, ఆయాలకు ఆయన డాక్టర్ ఎన్‌జేఆర్ భవనంలో నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చారని తెలిపారు. ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఆంగ్లం కూడా బోధిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భవతులకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధవరంలో జగనన్న సురక్ష



కోట, జూలై 26 ప్రభాతవార్త

కోట మండలం సిద్ధవరం, కోట సచివాలయం-3లలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కోట సచివాలయంలో ముఖ్య అతిథిగా తహశీల్దార్ పద్మావతి, ఇఒపిఆర్‌డి కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ వెంకటరమణయ్యలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సిద్దవరంలో కోట ఎంపిపి దాసరి అంజమ్మ, ఎంపిడిఓ మారెళ్ల భవాని, సర్పంచ్ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భవాని మాట్లాడుతూ ప్రభుత్వం 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం ఇస్తే లోపలికి రండి

సిద్దవరం పంచాయతీలోని 150 రేషన్‌కార్డుదారులకు ఈ నెలలో బియ్యం ఇవ్వలేదని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు సర్దిచెప్పారు. గత సంవత్సరం నుంచి కర్లపూడి, ఇల్లుకూరుపాడు గ్రామాలకు వెళ్లి తాము సరుకులు తెచ్చుకుంటున్నామని గ్రామస్థులు తెలిపారు. ఎమ్మెల్యేకి, అధికారులకు చెప్పినా న్యాయం జరగలేదన్నారు.

## డ్రైనేజి పనులు ప్రారంభం

కోట, జూలై 26 ప్రభాతవార్త

కోట మండలం కొక్కుపాడు పంచాయతీ పరిధిలోని ఉచ్చువారిపాలెం గ్రామంలో బుధవారం డ్రైనేజి పనులను ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ హేమంత్‌కుమార్ పర్యవేక్షణలో జరిగాయి. ఇక్కడ రోడ్డు పక్కన డ్రైనేజి లేకపోవడంతో తేలికపాటి వర్షం వచ్చినా ఇళ్లలోని మురుగంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది. దీంతో పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆ క్రమంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వరప్రసాదరావుకు ఆ గ్రామ వైసీపీ నాయకుడు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి తెలియజేయగా, రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో డ్రైనేజి పనులకు శ్రీకారంచుట్టారు.

## రోడ్డుపై బస్సు ఆపేసిన మహిళా కండక్టర్

కోట, జూలై 26 ప్రభాతవార్త



ఓ మహిళా కండక్టర్ నడిరోడ్డుపైన బస్సును ఆపుకొని రోడ్డుపక్కన కూరగాయలను కొనుగోలు చేయడంపై పలు విమర్శలకు దారి తీసింది. ఈ సంఘటన కోట మండలం చీకల్లదిబ్బ రోడ్డుపై బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగింది. కోట నుంచి ముత్తుకూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సును ఆ మార్గంలో మహిళా కండక్టర్ ఆపేసి పక్కన విక్రయిస్తున్న కూరగాయలు కొనుగోలు చేసింది. సింగిల్ రోడ్డు కావడంతో ఆటోలు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. కాస్త రోడ్డుపక్కన బస్సును ఆపి కొనుగోలు చేసుకోవచ్చు కదా అని ప్రజలు విమర్శించారు.

## కలిసికట్టుగా పనిచేయండి

కోట, జూలై 26 ప్రభాతవార్త



గూడూరు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు రాబోయే ఎన్నికల లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని కలిసికట్టుగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పార్టీ నాయకులకు సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గూడూరు నియోజకవర్గంలోని నాయకులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కోట పట్టణానికి చెందిన టిడిపి నాయకుడు షేక్ షంషుద్దీన్ చంద్రబాబునాయుడిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పనబాక లక్ష్మి దంపతులు కూడా పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## పరిశ్రమలు స్థాపించారా... విద్యాసంస్థలను తెచ్చారా?

నాలుగేళ్ళలో సాధించిన ప్రగతి ఏమిటో చెప్పమనండి: బొజ్జల సుధీర్

ఏర్పేడు,(శ్రీకాళహస్తి రూరల్),జూలై 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని నాలుగేళ్ళుగా పరిపాలిస్తున్న వైకాపా నాయకుడు ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూదనరెడ్డి సాధించిన సామాజిక ప్రగతి ఏమిటో చెప్పమనండని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం మండలంలోని జంగాలపల్లిలోని శ్రీనివాసపురంలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమాలను నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని దేశం ఇన్‌చార్జి విస్తృతంగా పర్యటిస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయక తమ పర్యటన సాగిస్తున్నారు.ఈ నేపధ్యంలో జంగాల పల్లిలో పర్యటించిన ఆయన తన తండ్రి సామాజిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పని చేసారన్నారు. నేడు ప్రభుత్వం వ్యక్తి గత ఖాతాల్లో సొమ్ములు వేసేసి ఇదే ప్రగతి అంటున్నారు.మరి రోడ్ల పరిస్తితి చూసారా?గ్రామంలో ఒక్క పని అయినా చేసారా? అని ప్రశ్నించారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి


శ్రీనివాసపురంలో పర్యటించిన తెలుగుదేశం నాయకుడు సుధీర్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వ నిధులతో విమానాశ్రయ అభివృద్ధి చేసారు. అలాగే డిక్సన్‌లాంటి భారీ పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలు కల్పించారు.శ్రీకాళహస్తి మండలంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసారు.రైతు సంక్షేమాన్ని కాంక్షించి ఎస్ ఎస్ కెనాల్‌ను ఏర్పాటు చేసారని వివరించారు.నేడు పరిపాలిస్తున్న పాలకులు ఏం తెచ్చారని ప్రశ్నించారు. తన తండ్రి ప్రతిష్టాత్మకమైన ఐఐటిని సాధించారు. ఐసర్‌ను ఇక్కడ ఏర్పాటు చేసి మండలానికి గుర్తింపు తెచ్చారని సుధీర్‌రెడ్డి వివరించారు.ప్రగతి కావాలో అధోగతి కావాలో తేల్చు కోవాల్సిన సమయం ఆసన్నమౌతుందని వివరించారు. గ్రామంలో ఆయనకు దేశం వర్గాలు భారీ స్వాగతం ఏర్పాటు చేసారు.ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు నైనారు పొన్నారావు,రెడ్డివారి గురువారెడ్డి, చెంచయ్యానాయుడు,ధనంజయులు నాయుడు, పాపిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, కృష్ణవేణి తదితర నాయకులున్నారు.

## జగనన్న కాలనీ గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



సత్యవేడు, జూలై 26,ప్రభాతవార్త: మండలంలో అసంపూర్తిగా ఉన్న జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలని తిరుపతి గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో హౌసింగ్ డిఈ శ్రీనివాస రావుతో కలిసి పక్కా గృహ నిర్మాణాల ప్రగతిపై సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లతో సమీక్ష నిర్వహించారు. పక్కా గృహాల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని, గృహ నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేటట్లు చూడాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈసందర్భంగా మండల వైకాపా కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి పలు సమస్యలను గృహ నిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్‌కు విన్నవించారు. గృహ నిర్మాణ శాఖ కార్యాలయం నాగలాపురం నుండి సత్యవేడుకు తరలించాలని, పక్కాఇళ్ళ కోసం నూతనంగా ధరఖాస్తులు చేసుకున్న 475 మందికి పక్కాఇళ్ళు మంజూరు చేయాలని, సిబ్బంది కొరత నియంత్రించేలా కొత్తవారిని నియమించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతామని హామి ఇచ్చారు.

## రైళ్ళలో జర్నలిస్టుల రాయితీని పునరుద్ధరించాలి

**- పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్**

రేణిగుంట, జూలై 26 ప్రభాతవార్త: విలేకరులకు రైళ్ళలో రాయితీలను పునరుద్ధరించాలని గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కోవిడ్-19 సమయంలో రద్దు చేసిన రాయితీని పునరుద్ధరించాలని లోక్‌సభలో రూల్ 377 కింద స్పెషల్ మెన్షన్ ద్వారా ప్రధాన మంత్రిని కోరినట్లు ఎంపీ కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటనలో తెలిపారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రజలకు వార్తలు, సమాచారం, అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జర్నలిస్టులు వృత్తి రీత్యా విస్తృతంగా ప్రయాణాలు చేస్తుంటారన్నారు. జర్నలిస్టులకు కోవిడ్-19 ముందు వరకు రాయితీ ఇచ్చారని, తరువాత మిగతా అన్ని రాయితీలను పునరుద్ధరించినప్పటికి జర్నలిస్టు రాయితీలను పునరుద్ధరించలేదన్నారు. రాయితీల ద్వారా రైల్వేకు ఏటా రూ.50 వేల కోట్ల భారం పడుతోందని తెలుసనన్నారు. అయితే జర్నలిస్టులకు రాయితీలు లేకపోవడం వల్ల వారిపై అదనపు భారం పడుతోందని, గుర్తింపు పొందిన ప్రెస్ కరస్పాండెంట్లకు రాయితీ, ఇతర సౌకర్యాలు వెంటనే కల్పించాలని, కోవిడ్ ముందఉ కాలంలోఉన్న విధంగా రాయితీలు పునరుద్ధరించాలని ప్రధానిని, రైల్వే మంత్రిని కోరారు.

## నేను మీకు తోడుగా ఉంటా! : బియ్యపు



శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త : మీరు నాకు అండగా ఉండండి. రాబోవు ఎన్నికల్లో నన్ను గెలిపించండి. మీకునేను ఎల్లవేళల్లో తోడుగా ఉంటా. మీ అభివృద్ధి కోసం ఆహర్నిశలు పాటు పడతా. సామాజికాభివృద్ధికి చేయూత ఇస్తానని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో రాజీవ్‌నగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఎలాంటి ఆదరణకు నోచుకొని 30కుటుంబాలు వైకాపా సభ్యత్వాన్ని తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మధుసూధనరెడ్డి వారికి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ముస్లింలు, ఇతర సామాజిక వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానన్నారు.గతంలో పరిపాలించిన వారు నిరుపేదల గురించి పట్టించుకోలేదని ఐదేళ్ళకొక మారు వచ్చి ఓట్లు వేసుకొని అధికార పీఠం ఎక్కి తరువాత మాయమయ్యేవారని అయితే తాను కరోనా కాలంలో తనకు కరోనా సోకినా ప్రజాసేవయే లక్ష్యంగా పని చేసానన్నారు. రాజీవ్‌నగర్‌కు చేరిన శేఖర్,సత్యరాజ్,దేవేంద్ర, వేలు, నరేష్, రాజా, సాయి, వెంకటేష్, మారయ్య, శ్యామల, సుబ్బు, గోపి,మునిరాజా,ధనా, సతీష్, రాజమ్మ, నాగ, రాజేష్, నాగమ్మ, మాతమ్మ, విజయ, అంకమ్మ, కవితా సులోచనల సారధ్యంలో పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..ఎంఎల్‌ఏ



తొట్టంబేడు, జూలై 26 ప్రభాతవార్త : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని శానసభ్యులు బియ్యపు మధుసూధన్‌రెడ్డి అన్నారు. బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తొట్టంబేడు మండలం లోని సాంబయ్యపాళెం గ్రామంలో ఆయన పర్యటిం చారు. ముందుగా ఈసందర్భంగా ఎంపిపి ఉన్నం నిర్మల, మండల కన్వీనర్ వైకాపా సీనియర్ నాయకులు ఉన్నం వాసు దేవనాయుడు, సర్పంచ్ సుజాత, తొట్టంబేడు సర్పంచ్ సుబ్బయ్య పలువురు యువత స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్‌ఏ ఇంటింటికి వెళ్ళి జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అలాగే అర్హత ఉండి పథకాలు అందని లబ్ధిదారులకు వెంటనే ఈపథకాలు అందేందుకు జగనన్న సురక్ష పథకాన్ని సిఎం ప్రవేశపెట్టారని దీన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునిరత్నం, మాజీ ఎంపిపి చంద్రయ్యనాయుడు, మాజీ సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మాతయ్య, శంకర్‌రెడ్డి, చెంచుమునిరెడ్డి, దుర్గారెడ్డి, సుధ, బలరాంరెడ్డి, గుడ్లూరువెంకట్రామానాయుడు, సుబ్రమణ్యం నాయుడు, డిల్లీబాబు, గరటారెడ్డి, షబ్బీర్, అబ్బు, గోపి, మురళీ, వెంకటయ్య, గంగాధరం, ధర్మయ్య, ధర్మయ్య, తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపిడిఓ సురేష్‌బాబు, ఇఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సూపర్‌బజార్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా చంద్రయ్య, రమేష్




పుత్తూరు, జూలై 26 ప్రభాతవార్త : పుత్తూరు కోపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షుడిగా చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఎం.చంద్రయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పోతుగుంట రమేష్‌తో పాటు డైరక్టర్లుగా హెచ్.అజిత, పి.అమ్ములు, ఇ.శైలజ, మేఘనాథ్, జె.యు.నవీన్‌కుమార్, బి.బాబు, పి.మునికృష్ణయ్య, పి.మునిశేఖర్ నాయుడులు ఎన్నికయ్యారు. బుధవారం వీరు సూపర్‌బజార్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సంధ్బంగా వీరు అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ పుత్తూరు ప్రజలకు తక్కువ ధరకే నిత్యావసర సరుకులు, టపాసులు తదితర వస్తువులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా వి.సురేష్‌బాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు పోతుగుంట విజయ్‌బాబు, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి ఇనుగుర్తి రవినాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పెమ్మసారి సుమన్‌నాయుడు, తడుకు మాజీ ఎంపిటిసి ధనపాల్, ఇంకా హెచ్.సుబ్బయ్య, సురేష్, అప్పయ్య తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నగరి మున్సిపాలిటీలో జగనన్న సురక్ష కార్యక్రమం




నగరి, జూలై 26 ప్రభాతవార్త: నగరి మున్సిపాలిటీ నగరి వెస్ట్ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో పేదల గురించి ఆలోచించే ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒక్కరేనని నేను గర్వంగా చెబుతానని తెలియజేశారు. ఎందుకంటే రాష్ట్ర ప్రజల కష్టాలను తెలుసుకున్న జగనన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను, గ్రామాల్లో అభివృద్ధిలను అందిస్తూ ఇంకా వాళ్ళకు ఏవైనా అవసరాలు ఉన్నాయేమో అని ఆలోచించి ప్రతి ఎమ్మెల్యేలను ప్రతి మినిస్టర్లను కార్యకర్తలను నాయకులను అధికారులను సచివాలయ సిబ్బందిలను ప్రతి ఒక్కరిని ప్రతి ఒక్క ఇంటికి పంపించి మీకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా ఇంకేమైనఆ అవసరాల ఉన్నాయని తెలుసుకుని అవి అప్పటికప్పటికే పరిష్కరించమని ఆదేశాలు ఇస్తూ ఇంకేమైనా సర్టిఫికెట్లు ద్వారా పథకాలు అందకుండా ఉన్నాయేమో అని ఆలోచించి జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి మన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని తెలియజేశారు. ఈ జగనన్న సురక్షకార్యక్రమంలో 574 మందికి సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో నగరి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కమిషనర్, డీఈ, కన్వీనర్, స్టేట్ బోర్డు మెంబర్లు, కౌన్సిలర్లు కో-ఆప్షన్ సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## ఉద్యోగమేళాలో 23 మంది ఎంపిక

నగరి, జూలై 26 ప్రభాతవార్త: నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో కాల్‌మాన్ చెన్నై వారి ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ మేళాలో 60 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరు కాగా 23 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలో ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఎంపికైన వారికి రూ.13 వేల నుంచి 15 వేల వరకు ఉంటుందని కంపెనీ ఆపరేషన్ మేనేజర్ ధనరాజ్ తెలిపారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్, కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ పార్థసారధి, టీం లీడర్ ఆనంద్, శ్రీకాంత్, కళాశాల ప్రధానోపాధ్యాయురాలు పంకజ, జేకేసీ లాల్ బాషా, తదితరులు పాల్గొని అభినందించారు.

## నేడే తాత్కాలిక అంగళ్ళకు వేలం

పుత్తూరురూరల్, జూలై 26 ప్రభాతవార్త: శ్రీ ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆగస్టు 19 నుంచి 28వ తేదీ వరకు కురుక్షేత్రం స్థలంలో తాత్కాలిక దుకాణాలను, చట్ట విరుద్ధం కానీ వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు నేడు గురువారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆరేటమ్మ ఆర్చి నిర్మాణ పనులకు రూ.50 వేలు వితరణ



పుత్తూరురూరల్, జూలై 26 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం లోని గ్రామదేవత ఆరేటమ్మ ఆర్చి నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోపుత్తూరు పట్టణానికి చెందిన డీఆర్‌ఏ గ్రూప్(రియల్ ఎస్టేట్) పురం దామోదరం, రాకేష్ జైన్, టి.బి.అయ్యప్ప, వి.ఎం.గోపి ఆధ్వర్యంలో ఆర్చి నిర్మాణ పనుల కోసం రూ.50వేలు ఆలయ చైర్మన్ వ ు న ో వ ా ం ో ె ం డ ి డ ి కి అందించారు.కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, మాధవలు పాల్గొన్నారు.

## ఆధునిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకోవడానికి కృషి చేయాలి



పుత్తూరురూరల్, జూలై 26 ప్రభాతవార్త: కాలానుగుణంగా మా రుచెందుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకోవ డానికి విద్యార్థులు కృషి చేయా లని, ఆ రకంగా మంచి ఫలితా లను సాధించాలని పుత్తూరు మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాల సుబ్రహ్మ ణ్యం కోరారు. బుధవారం పుత్తూరు మండలం గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో ఆల్లూరు కోటయ్య జ్ఞాప కార్థం పదో తరగతి పరీక్షల్లో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి తగ్గట్టుగా విద్యార్థులు తమ యొక్క లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత ప్రమాణాలతో విద్యనభ్యసించాలని, అదే విధంగా గొప్ప విద్యావేత్తగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఆళ్లూరు కోటయ్య కుమారులు శ్రీనివాస్, జగదీష్ తమ తండ్రి ఆశయ సాధన కోసం తాము మంచి చదువులు చదివి ఈ రోజు ఉన్నత స్థానంలో ఉన్నామని, తమ తండ్రి ఆదర్శం కోసం గొల్లపల్లి పాఠశాలలో ఈ సంవత్సరం నుంచి పదో తరగతిలో ఉన్నత మార్కులు పొందిన వారికి తాము ఆర్థిక పరంగాను, అదే విధంగా అవార్డుల పరంగాను సన్మానిస్తామని, ప్రతి సంవత్సరం ఈ ఆనవాయితీని కొనసాగించి పేద పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవడానికి ప్రోత్సాహన్ని అందిస్తామని తెలియజేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యా యులు నరసింహులు మాట్లాడుతూ సహృదయంతో ఆళ్లూరు కోటయ్య కుటుంబీకులు ఈ రోజు పిల్లలను సన్మానించడం, వారికి ఆర్థికంగా చేయూతనివ్వడం, అదే విధంగా పాఠశాలకు తగిన సహాయ సహకారా లు అందించడం హర్షించదగ్గ విషయమని వారి యొక్క ఆశలకు, ఆకాంక్షలకు తగ్గట్టుగా విద్యార్థులు నడుచుకుని వారికి కృతజ్ఞతలుగా ఉండాలని కోరారు. అనంతరం గత పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన హాసిని కృష్ణ, హర్షిత, ధనలక్ష్మీలకు శాలువ, మెమెంటోలతో సన్మానం చేసి ఒక్కొక్కరికి రూ.2 వేలు నగదు బహుమతి అందజేశారు. దీంతో పాటు 1995-96వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా పాఠశాలకు 25 వేలు విలువ చేసే ప్రింటర్‌ని ఉచితంగా అందజేసి అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా 1995-96 బ్యాచి పదో తరగతి విద్యార్థులకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో మండల ప్రెసిడెంట్ ఎం.చంద్రయ్య, వైస్ ప్రెసిడెంట్ పి.రమేష్, స్థానిక సర్పంచ్ విరిత దేవేంద్రరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, గ్రామస్థులు, కోటయ్య కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వడమాలపేట, జూలై 26 ప్రభాతవార్త: పుత్తూరు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వారిచే శ్రీ బొమ్మరాజుపురంలో నిర్వహించిన మహా మెడికల్ క్యాంప్‌కు మంచి స్పందన లభించింది. ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి, హియర్ ఇన్‌స్ట్రామెంట్ ఆస్పత్రి డాక్టర్లు మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఆర్. మణి రాజు, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్, ప్రెసిడెంట్ కోనేటి రవిరాజు ఆధ్వర్యంలో క్యాంప్ జరిగింది. బీపీ, షుగర్, బ్లడ్ కొలెస్ట్రాల్, ఈసీజీ, చెవి పరీక్షలు చేసి 350 మందికి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది. ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి డాక్టర్ పూర్ణచంద్రారావు, పీఆర్‌వో వెంకటేష్, మనోజ్‌కుమార్, హేమావతి, వాసన్ ఐ కేర్ డాక్టర్ జ్యోతి, పీఆర్‌వో మస్తాన్, ఫార్మాసిస్ట్ సుధాకర్‌వర్మ, హీరింగ్ ఆస్పత్రి అభిలాష, గణేష్, పాఠశాల హెచ్‌ఎం జయశ్రీ, హైస్కూలు హెడ్ మాస్టర్ సుబ్రహ్మణ్యం రాజు, రఘు, వైస్‌ప్రెసిడెంట్ రవి, వార్డు మెంబరు జి.హరి రాజు, విజయకుమార్, శంకర్, వెంకటరామరాజు, నారాయణరాజు, శ్రీనివాసులు, యయాతి, చెంగల్రాజు, సుబ్రహ్మణ్యంరాజు, వర్మ, స్వాతి, రత్న, కమలమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేను మాటిస్తున్నాను... మీ అందరికి అందుబాటులో ఉంటానని

**-జగనన్న సురక్షలో ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి**



తిరుపతిరూరల్, జూలై26 ప్రభాతవార్త: నేను మాటిస్తున్నాను... మీఅందరికి అందుబాటులో ఉంటానని..నేను మాటిస్తున్నాను..మీ అండగా ఉంటానని యువనేత, వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మరోసారి తుమ్మలగుంట ప్రజలకు భరోసా ఇచ్చారు. బుధవారం తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగి ఏ ఒక్కరూ సంక్షేమం పొందలేని నిస్సహాయ స్థితిలో ఉండకూడదనే ఆలోచనతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఏలాంటి రుసుం లేకుండా 11 రకాల కార్డులను ఉచితంగా అందజేయబడునని తెలిపారు. తన తండ్రి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా పని చేస్తానని స్పష్టం చేసారు. తుమ్మలగుంట ప్రజల ఆశీస్సులతో పాటు చంద్రగిరి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు తనకు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకట నారాయణ, తుమ్మలగుంట సర్పంచ్ నల్లందుల సుబ్బరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, మాజీ ఎంపిటిసి సభ్యులు నల్లందుల సుధాకర్‌రెడ్డి, ఎంపిటిసి బుజ్జమ్మ, మాజీ సర్పంచ్‌లు చెవిరెడ్డి జయచంద్రారెడ్డి, చెవిరెడ్డి రామచంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డి, దొడ్ల కరుణాకర్‌రెడ్డి, దేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెంచురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసాయి సుధా ఇంగ్లీషు మీడియం స్కూల్లో స్ట్రాబెరీ డే



తిరుపతిరూరల్, జూలై26 ప్రభాతవార్త: శ్రీ సాయి సుధా ఇంగ్లీషు మీడియం స్కూల్లో స్ట్రాబెరీ డేని ఘనంగా నిర్వహించారు. బుధవారం శ్రీసాయిసుధా స్కూల్లో పిల్లలు స్ట్రాబెరీ వేషధారణలో అలరించారు. స్ట్రాబెరీ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి పిల్లలకు ప్రిన్సిపల్ నాగేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో అభిషేక్, అకడమిక్ ప్రిన్సిపల్ వెంకటకృష్ణ, మేనేజర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## పులివర్తి నానికి స్వాగతం పలికిన తిరుచానూరు టిడిపి



తిరుచానూరు, జులై 26 ప్రభాతవార్త : తెలుగు దేశం పార్టీ చిత్తూరు జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని అమెరికా ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో తెలుగు అసోసియేషన్ ఆఫ్‌నార్త్ అమెరికా (తానా) ఘనంగా సన్మానించారని కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కిషోర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచంలోని తెలుగు వారందరికీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబే ఆదర్శమని చెప్పారు. ఆంధ్రులు అత్యంత ప్రతిభావంతులని కొనియాడారు. అమెరికాలో అనేక రంగాల్లో చక్కగా రాణిస్తున్నారని ప్రశంసించారు. భారత సంస్కృతి సంప్రదాయాలు ఉన్నతమైనవని కిషోర్‌రెడ్డి అభివర్ణించారు. క్రమశిక్షణకు మారుపేరు తెలుగువారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే తెలుగు వారి సంక్షేమానికి కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కిషోర్‌రెడ్డి, హరిరామ్‌రెడ్డి, సాయి రాయల్, వాసు, విజయ్ తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్యన్న ఆకస్మిక మృతి హృదయవిధారకం

చంద్రగిరి, జూలై 26 ప్రభాతవార్త: తొండవాడ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకుడు తపసి సత్యనారాయణ రెడ్డి (సత్యన్న) మృతి తమకు హృదయవిధారకమని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని కంటతడి పెట్టుకున్నారు. బుధవారం ఆయన తొండవాడలోని సత్యన్న నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. ఈ ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మల్లీశ్వరీ, తపసి తిరుమల రెడ్డి, తపసి లత, పులికంటి మోహన్ రెడ్డి, పులికంటి తేజోవతి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. సత్యన్న మరణం తనకు తీరని దుఃఖం మిగిల్చిందన్నారు. సత్యన్న పార్టీకి, ప్రజలకు అందించిన సేవలను ఎన్నటికీ మరువలేమన్నారు. మీకు పార్టీ, తాను అండగా వుంటానని అన్నారు.

## తెలుగు తమ్ముళ్ళకు బెయిల్ .. ఘన స్వాగతం



చంద్రగిరి, జూలై 26 ప్రభాతవార్త: ఇసుక అక్రమ రవాణాపై టిడిపి నిర్వహించిన ఆందోళన కేసులో అరెస్ట్ చేయబడిన తెలుగు తమ్ముళ్ళు మణి యాదవ్, శ్రీకాంత్‌లకు బుధవారం బెయిల్ లభించింది. మండల పరిధి లోని రెడ్డివారిపల్లి వద్ద స్వర్ణముఖీ నదిలో ఇసుక అక్రమంగా తరలించడంపై టిడిపి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడంతో పోలీసులు 24 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో మణి యాదవ్, శ్రీకాంత్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టిడిపి నాయకత్వం కోర్టులో వీరికి బెయిల్ అందించడం ద్వారా తొండవాడ బస్టాండ్ ఆర్చి వద్ద టిడిపి నాయకులు తెలుగుతమ్ముళ్ళను గజమాలతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. గ్రామంలోనికి ఊరేగింపుగా తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్లాడుతూ మీ పోరాటాలను వృధా కానివ్వబోనన్నారు. మీ పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించిన తీరుకు మూల్యం చెల్లించకతప్పదన్నారు. ఈ అరాచక పాలనకు ప్రజలే తగినబుద్ధిచెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య వృత్తికే నా జీవితం అంకితం

రేణిగుంట, జూలై 26 ప్రభాతవార్త: వైద్య సేవకే తన జీవితం అంకితం అని సురక్ష ఆస్పత్రి అధినేత డాక్టర్ హేమకుమార్‌రెడ్డి అన్నారు. రేణిగుంట విమానాశ్రయ మార్గంలోని అక్షయ క్షేత్రంలో హేమ కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు ప్రత్యేక ప్రతిభావంతుల మధ్య బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రతిభావంతుని చేత కేక్ కట్ చేయించి అందరికి పంచిపెట్టారు. తరువాత వివిధ రకాల ఆహార పదార్థాలతో అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ తన పుట్టిన రోజు ప్రత్యేక ప్రతిభావంతుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రోజుకు 15 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవ చేస్తున్నామన్నారు. రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో డాక్టర్ చేసిన సేవలు మరువలేనివన్నారు. తండ్లం ఎంపీటీసీ శశికిరణ్ వేడుకల్లో రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైసీపీ నేతలు యోగేశ్వరరెడ్డి, అనిల్, మురుగయ్య, శంకర్‌రెడ్డి, విశ్రాంత రైల్వే ఉద్యోగులు రాజేంద్ర, హసన్, సురక్ష ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేరుశనగ పంటపై రైతులకు అవగాహన



ఎర్రావారిపాళెం,జులై 26ప్రభాతవార్త: ఖరీఫ్,రబీ సీజన్‌లో వేరుశనగ పండించే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట అధిక దిగుబడి రావడానికి అనుసరించాల్సిన విధానంపై బుధవారం ఎర్రావారిపాళెం మండలం బోడిపాటివారిపల్లి పంచాయతిలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి,వేరుశనగ కార్యక్రమం జరిగింది. ఒక చదరపుకిలోమీటరు విస్తీర్ణంలో విత్తనం మొలకెత్తిన తరువాత మొక్కలు ఎన్ని ఉండాలో లెక్కించి రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో అయితే చదరపు కిలోమీటరుకు 33మొక్కలు, రబీలో 44 మొక్కలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఇలా పంటవేసుకోవడం వల్ల దిగుబడి అధికంగా వస్తుందని వ్యవసాయ అధికారిని తెలిపారు. రైతులు ఈ సూచనలు పాటించి వేరుశనగ దిగుబడి సాధించుకోవాలన్నారు.

## పేదలకు చేస్తున్న మీ సేవలు అభినందనీయం!

**-కర్ణాటక ప్రభుత్వ ఎండోమెంట్ కమిషనర్ బసవ రాజేంద్ర**



తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 26 ప్రభాతవార్త: గత 20 ఏళ్లుగా మీ కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ మరియు డా॥వైఎస్ ఆర్ ప్రజా ప్రస్థానం సేవా ట్రస్టుల ద్వారా జిల్లాలోని నిరుపేదలకు మీరు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కర్ణాటక ప్రభుత్వ దేవాదాయ శాఖ కమిషనర్ బసవ రాజేంద్ర (ఐఏఎస్)ట్రస్ట్ చైర్మన్ డా॥పిసి. రాయులును ప్రశంసించారు. మంగళవారం డా॥పిసి.రాయులు జన్మదిన వేడుకల్లో భాగంగా ఎన్ఆర్ఐ పెట్టుబడులపై ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు ఎం.జ్ఞానేంద్రారెడ్డి,బసవ రాజేంద్రలు హాజరయ్యి ఆయనకు పూలమాల మెడలో వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వివిధ 15 సంఘాలకు చెందిన అధ్యక్షులు, ఆఫీస్ బేరర్లు మాట్లాడుతూ కస్తూర్బాగాంధీ కేంద్రట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో పలు చోట్ల రక్తదానాలు నిర్వహించడం,పేదలకు అన్నదానాలు చేయడం పిసి.రాయులు గొప్ప మనసుకు నిదర్శనమని కొనియాడారు.

## దర్గామిట్టలో మొహరం వేడుకలు

శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మొహరం పండగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మొహరం ఏడవ రోజు సందర్భంగా పీర్ల పండగను సంబరాలు జరుపుకున్నారు. బుధవారం దర్గా మిట్ట వద్ద మకాన్‌లో ఇమాంఖాసిం పీరు వద్ద ఫాతేహా ఇచ్చారు.ఈ ఉత్సవాలను మతాలతో సంబంధం లేకుండా దర్గా మిట్ట వద్ద పీర్లపండగలో దర్గా ఆహ్మద్,దర్గా బాబా, బిజెపి నాయకుడు గరికపాటి రమేష్‌బాబు, న్యాయవాది రాజేశ్వరరావు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ఏడవ రోజు ఇమాం ఖాసిం పీరు ఊరేగింపు.8వ రోజు అగ్నిగుండ ప్రవేశం పదవ రోజు నిమజ్జనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# సైబర్ క్రైమ్ బాధితునికి సకాలంలో న్యాయం


బాధితుడికి న్యాయం చేసిన సైబర్ సెల్ సిఐ

తిరుపతి క్రైం, జూలై 26 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా ఎస్వీయు క్యాంపస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ బాలాజీ కాలనీ నందు కాపురం వుంటున్న డాక్టర్ సి. రమేష్ తన యూనియన్ బ్యాంకు అకౌంట్ నుండి జూన్ 30వ తేది అతని మొబైల్‌కు తన ఖాతా నుండి 17500 రూపాయిలు లావాదేవీ జరిగినట్లు మెసేజ్ రాగా, అతనువెంటనే వెళ్లి తన ఖాతాను చెక్ చేసుకోగా సదరు బ్యాంకు అకౌంట్ నుండి మొత్తం 156092 రూపాయిలు పోయినట్లుగా గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు తిరుపతి సైబర్ క్రైమ్ లాబ్ ఆఫీస్‌కు వెళ్లి ఫిర్యాదు చేసారు. వెంటనే సదరు ఫిర్యాదుపై స్పందించిన సిఐ జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డికి కేసు పుర్వ పలాలను వివరించగా, ఎస్పీ త్వరగా అన్నీ కోణాల్లో కేసును దర్యాప్తు చేసి బాధితుడు పోగొట్టుకున్న మొత్తం నగదును తిరిగి రిఫండ్ చేయండని ఆదేశాలు ఇచ్చారు. సైబర్ ల్యాబ్ ఇన్స్పెక్టర్ రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఉన్న సైబర్ క్రైమ్ నిపుణులు రంగంలోకి దిగి, ఫిర్యాదుదారుని బ్యాంకు అకౌంట్ స్టేట్మెంట్ వివరాలను తీసుకుని ఆ ట్రాన్సాక్షన్స్ అన్ని కూడా పిఓఎస్ ట్రాన్సక్షన్ నుండి అమెజాన్ వాలెట్‌కి వెళ్లినట్లుగా గుర్తించి, ఎన్‌సిఆర్‌పి పోర్టల్ నందు ఫిర్యాదును నెంబరుగా అప్లోడ్ చేయడం జరిగిందన్నారు. తరువాత వెంటనే అమెజాన్ నోడల్ అధికారులతో మాట్లాడి మోసపూరిత నగదును స్తంభింపచేయించడం జరిగింది. బుధవారం మొత్తం నగదును తిరిగి బాధితుని బ్యాంకు ఖాతాలో జమచేయడం జరిగింది. తిరుపతి జిల్లా ప్రజలు ఎవరైనా సైబర్ క్రైమ్ భారిన పడినట్లయితే అధైర్య పడకుండా వెంటనే పోలీస్ పెరేడ్ మైదానం నందు ఉన్న సైబర్ క్రైమ్ ఆఫీస్‌కు వెళ్లవల్సిందిగా కోరారు. సైబర్ క్రైమ్‌కు గురైన వారు గోల్డెన్ అవర్ 24 గంటల లోపు సైబర్ క్రైమ్ ఆఫీస్‌కు వెళ్ళినట్లయితే మీకు న్యాయం జరిగే అవకాశం మెండుగా ఉంటుంది లేదా మీరు అందుబాటులో లేనట్లయితే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చును లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

# రూ. 63 కోట్లతో పుత్తూరు మునిసిపాలిటీ సమగ్రాభివృద్ధి : ఛైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ హరి

పుత్తూరు, జూలై 26 ప్రభాతవార్త : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఇప్పటి వరకూ పుత్తూరు మునిసిపాలిటీలో మొత్తం రూ. 63 కోట్లతో వ్యయంతో సమగ్రాభివృద్ధి సాధించామని ఛైర్మన్ ఆనంగి హరి స్పష్టం చేశారు. బుధవారం ఆయన అధ్యక్షతన పుత్తూరు మునిసిపాలిటీ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునిసిపాలిటీలో మౌలిక సదుపాయాలతో పాటు పార్కులు, మునిసిపల్ పరిపాలన భవన నిర్మాణం, శ్మశాన ఆధునికీకరణ తదితర అభివృద్ధికి మంత్రి ఆర్.కె.రోజా ఎనలేని కృషి చేశారని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లతో పాటు, ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహించే వార్డుల్లో సైతం రాజకీయాలకు అతీతంగా రోడ్లు డ్రైనేజీ, వీధి లైట్లు, మంచి నీటి సరఫరా వంటి అభివృద్ధి పనులు నిర్వహి ంచామని తెలిపారు. దీంతో పాటు ప్రస్తుత నెలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో కేవలం రోజుల వ్యవధిలో కుల, ఆదాయ, నివాస తదితర ధృవపత్రాలను సుమారు 7000 మంది లబ్దిదారులకు ఉచితంగా అందించామన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఈ ధృవపత్రాల కోసం ప్రజలు తహశీల్దారు ఆఫీసు చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని గుర్తు చేశారు. కరోనా సమయంలో తన ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒకటిన్నర కోటి రూపాయలు ఖర్చు పెట్టి ప్రజలకు నిత్యావసర సరుకులు, మందులను మ ంత్రి ఆర్.కె.రోజా ఉచితంగా అందించారని తెలిపారు. ప్రతి బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గర్భిణీలకు ఉచితంగా పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. రోజా నేతృత్వంలో పుత్తూరు మునిసిపాలిటీ సర్వతోముఖాభివృద్ధి చెందుతున్నప్పటికీ తెలుగుదేశం పార్టీ నాయకులు అభివృద్ధి జరగలేదని లేనిపోని విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. ముఖ్యంగా 27వ వార్డు టిడిపి కౌన్సిలర్ బసంతి చేస్తున్న ఆరోపణల్లో అర్థం లేదని, ఆమె తనను గెలిపించిన వార్డు ప్రజలనే పట్టించుకోవడం లేదని తెలిపారు. భవిష్యత్‌లో ఆమె అర్థం లేని విమర్శలు చేస్తే తమ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా కౌన్సిలర్లు తగిన విధంగా బుద్ది చెబుతారని హెచ్చరించారు. అనంతరం ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్లు డి.జయప్రకాశ్, డి.శంకర్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గంగ జాతరలో పాల్గొన్న గాలి జగదీష్



పుత్తూరు, జూలై 26 ప్రభాతవార్త : పట్టణంలోని ఎన్జీవో కాలనీలో బుధవారం జరిగిన గంగ జాతరలో జిఎంకె ట్రస్ట్ అధినేత, దివంగత గాలి ముద్దుకృష్ణమ నాయుడు తనయుడు గాలి జగదీష్ పాల్గొని అమ్మ వారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఆయన మండలంలో ఉత్తరపు కండ్రిగ గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఏసుదాస్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

## తప్పుడు పత్రాలు సృష్టించి స్థలాలు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు

తిరుపతి క్రైం, జూలై 26 ప్రభాతవార్త : తప్పుడు పత్రాలు సృష్టించి భూములు కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకున్నామని తిరుపతి రూరల్ పోలీసులు తెలిపారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వే నెం. 13 మట్టం భూమిని అన్యాక్రాంతంగా ఆక్రమించి అనదికారంగా కట్టడాలు చేపట్టిన ఉప్పరపల్లికి చెందిన ఎలకాయల లతాని, ఆమె అనుచరులను తిరుపతి రూరల్ ఎంఆర్ఓ ముందు బౌండ్ఓవర్ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. అలాగే హైదరాబాదు ఎల్‌బి నగర్ మున్సురాబాద్, సహారా స్ట్రీట్, న్యూ బహార్ డోర్ నెం. 1ఎ/15లో నివాసం ఉన్న లేట్ వి. పద్మనాభన్ కుమారుడు వేలూరు మధుసూదన్ ఫిర్యాదు మేరకు తన తండ్రి బ్రతికి వుండగానే 1977 సంవత్సరంలో గెజిటెడ్ ఆఫీసర్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా మధుసూధన్ తండ్రి వి. పద్మనాభం పేరు మీద ప్లాట్ నెంబర్ 77, సర్వే నెంబర్ 585 పేరూరు గ్రామం లెక్క దఖలలో 3750 స్కోయర్ పీట్ ఇంటి స్థలం రిజిస్టర్ అయిందని తెలిపారు. ఆ స్థలాన్ని కొంత మంది కుట్ర పన్ని ఫోర్జరీ డాకుమెంట్స్‌లను సృష్టించి, ఆ స్థలంలో ఆక్రమ కట్టడం చేస్తున్నాని తెలిపారు. మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఎవరైనా తప్పుడు పత్రాలు సృష్టించి, స్థలాలు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే,చట్టరిత్య కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఆధ్యాత్మికతకు అర్థం పట్టిన బ్రహ్మ యజ్ఞం

## వేద విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం




రేణిగుంట, జూలై 26 ప్రభాతవార్త: రేణిగుంట శ్రీ రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణ శ్రీ రాజరాజేశ్వరి జ్ఞాన పీఠంలో పీఠాధిపతులు మూర్తి స్వామి ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య నిర్వహించిన బ్రహ్మయజ్ఞం ఆధ్యాత్మికతకు అర్థం పట్టినట్టుగా జరిగింది. దాదాపు 2000 మంది మహా పండితులతో జరిగిన పురోహిత, స్మార్త విద్వాన్ మహాసభలో వక్తలు అనేక విషయాలను వివరించారు. పురోహిత్యాన్ని బ్రాహ్మణ కుల వృత్తిగా ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీ రాజరాజేశ్వరి జ్ఞానపీఠం వేద మంత్రాలతో మారుమోగింది. వక్తలు పురాణ, ఇతిహాస, బ్రాహ్మణత్వంపై మాట్లాడిన ఉపన్యాసాలు అందరిని మంత్రముగ్ధుల్ని చేశాయి. యజ్ఞం జరుగుతున్న సమయంలో భక్తులు భక్తి పారవశ్యంతో తన్మయత్వం చెందారు. పెళ్లి కాని యువకులకు వేద పండితులు శ్రీఘ్రమేవ కల్యాణ ప్రాప్తిరస్తు అంటూ దీవించారు. మరి కొంత మందికి యజ్ఞో పవీతం జరిపించారు. కర్నూలు శివ సాయిబాబా, వేలూరు బంగారు గుడి శ్రీ నారాయణి అమ్మన్ ప్రథమ శిష్యులు కల్యాణ్, విజయకుమార్, శక్తి పీఠంలో ప్రత్యేక ఆకర్షణగా దర్శనమిచ్చారు. గుంతకల్ డివిజన్ రైల్వే ఎస్పీ చౌడేశ్వరి, తిరుపతి రైల్వే డీఎస్పీ షాను, లయన్స్‌క్లబ్ దయానంద్, షర్మిల, పీఏ అశోక్, తదితర ప్రముఖులు అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను వీక్షించి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు తమ పేర్లను నమోదు చేసుకున్నారని మూర్తి స్వామి తెలిపారు.

## సర్వేలో బిఎల్‌ఏలకు సమాచారం ఇవ్వండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జూలై 26 ప్రభాతవార్త : ఓటర్ల సర్వేకి వెళ్లేటప్పుడు బూత్ లెవల్ ఆఫీసర్స్ తమ వెంట గుర్తింపు పొందిన జాతీయ రాజకీయ పార్టీల తరుపున నియమించిన బూత్ లెవల్ ఏజెంట్స్‌లకు సమాచారం ఇచ్చి తమతో తీసుకెళ్లవచ్చని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్, తిరుపతి నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి హరిత ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి నియోజకవర్గంకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం తిరుపతి నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ తమ పార్టీ తరుపున పంపించిన బిఎల్ఏలకు కొన్ని ప్రాంతాల్లో సర్వేకు వెళ్లేటప్పుడు, సరైన సమాచారం ఇవ్వడం లేదని తెలపడంతో స్పందించిన కమిషనర్ బిఎల్ఏలకు, సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేస్తూ తిరుపతి నియోజకవర్గంలో ఇంటింటికి జరిగే ఓటర్ల సర్వేకు వెళ్లేటప్పుడు, ఇప్పటికే వైసిపి, టిడిపిల తరుపున రెకమెండ్ చేసిన బిఎల్ఎలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, తిరుపతి నియోజకవర్గం ఏఇ ఆర్‌వోలు, అర్బన్ ఎమ్మార్వో వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ జీవన్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైసిపి నేతలు

-'జీరో' ఇంటి నెంబర్లతో 'హీరో'లు అయ్యేందుకు ప్రయత్నం

-జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 26 ప్రభాతవార్త: 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు వైసిపి అగ్ర నేతల నుండి చిన్న స్థాయి కార్యకర్తల వరకు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూనే ఉన్నారని జనసేన పిఏసి సభ్యుడు,ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్ మండిపడ్డారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఈ మేరకు 'జీరో' ఇంటి నెంబర్లతో రాబోవు ఎన్నికల్లో దొంగ ఓట్లేయించుకుని 'హీరోలు' అయ్యేందుకు వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారంటూ ఎద్దేవా చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తన మాటల్లో పదే పదే వైనాట్ 175 అని అంటుంటే ఏమో అనుకున్నాము.కానీ అసలు విషయం ఇప్పుడే అర్థమయింది వారు దొంగ ఓట్లపైన ఆధారపడ్డారని.ఇప్పుడిప్పుడే ప్రజలకు సైతం అర్థమవుతోంది,వాలంటీర్లను అడ్డం పెట్టుకుని వైసిపి నేతలు ఏ విధంగా దొంగ ఓట్లు నమోదు చేసుకుంటున్నారో ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని ఛీత్కరించారు.

## రెస్లింగ్ పోటీల్లో పల్లం విద్యార్థుల ప్రతిభ



ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్),జూలై 26 ప్రభాతవార్త : ఇటీవల జరిగిన జిల్లా స్థాయి రెస్లింగ్ పోటీల్లో ఏర్పేడు విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థులను బుధవారం పాఠశాలలో సత్కరించారు. రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో జరిగిన రెస్లింగ్ పోటీల్లో మండలానికిచెందిన పల్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు. రేణిగుంటలో జరిగిన రెస్లింగ్ పోటీల్లో డి.జ్యోతిప్రసాద్, కె. విష్ణు, ఆర్. హర్షవర్ధన్,ఎం.శ్రీను, బి.మునికుమార్, పి.చెంగారెడ్డి, కె. నిరంజన్, ఎం.పవన్, ఎస్ హేమంత్,కె.సూర్య జిల్లా స్థాయిలో ఎంపికయ్యారు.ఈ నెల 29న అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.ఎంపిక కాబడిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.ఆనంద్, పిడిలు పుష్పవాణి, వాణి, మోహర్‌బాబు, కెవి బాబు ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

## కారూరులో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

- తొలిరోజు ప్రశాంతంగా అంబళ్లు, పొంగళ్లు



తడ, జూలై 26 ప్రభాతవార్త : తడ మండలం కారూరు గ్రామంలో పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్ల మధ్య చల్లాతమ్మ జాతర మొదలైంది. బుధవారం నుంచి నాలుగురోజుల పాటు ఈ జాతర కొనసాగనుంది. అయితే ఇక్కడ రెండు వర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడుతుందన్న అనుమానంతో 60 మందికి పైగా పోలీసులను రప్పించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒకవర్గంవారు మాత్రమే జాతర కమిటీలు వేసుకొని మరో వర్గం వారిని నిర్లక్షం చేశారని కోర్టుకు వెళ్లడం, ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇటీవల పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామపెద్దలను పిలిపించుకొని శాంతి సమావేశం జరిపినప్పటికీ ఫలితం లేకపోయింది. దీనితో ఒక వర్గంవారు మాత్రమే బుధవారం అంబళ్లు పోసి పొంగళ్లు పెట్టారు. రాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. కారూరు పంచాయతీ పరిధిలోని ప్రధాన గ్రామం కారూరుతో పాటు కారూరుమిట్ట, బాలకృష్ణాపురం, కాసింగాడుకుప్పంలలో ఒక్కోరోజు ఈ చల్లాతమ్మ తిరునాళ్ల నిర్వహిస్తున్నారు. సూళ్లూరుపేట సిఐ వెంకటేశ్వర్లురెడ్డి, తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డితో పాటు శ్రీహరికోట, దొరవారిసత్రం, నాయుడుపేట, శ్రీసిటీ పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, 35 మంది పోలీసులు, 20 మంది స్పెషల్ పార్టీలతో కారూరు మొత్తం పోలీసు బూట్ల చప్పుళ్లతో నింపేశారు. బుధవారం ఇక్కడ కొంత ప్రశాంత వాతావరణం మధ్య చల్లాతమ్మ తిరునాళ్ల ప్రారంభమైంది.

## పేదల సంక్షేమ సీఎం జగన్మోహన్‌రెడ్డి

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి



వెంకటగిరి, జులై 26, ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి తెలిపారు. వెంకటగిరి పట్టణం 11వ వార్డు రాణి పేటలో జోరువానలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ఇస్తామని తెలిపారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా లబ్దిదారుల ఖాతాల్లో సంక్షేమ పథకాలు జమ చేస్తున్నట్లు చెప్పారు. లక్ష 25వేల మందికి సచివాలయాల్లో ఉద్యోగాలతో నిరుద్యోగ సమస్య తీర్చినట్లు చెప్పారు. రెండున్నర లక్షల మంది వలంటీర్లు పెట్టి ఐదు వేల రూపాయలు ప్రతి నెలా ఇచ్చి వారి జీవితాల్లో కొంత వెలుగులున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లను కూడా సీఎం పరిష్కరించినట్లు చెప్పారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరి వచ్చిన సందర్భంగా ఒక్కో సచివాలయానికి రూ.50 లక్షల నిధులు ఇస్తామని వరాల జల్లులు కురిపించారని, కనుక వార్డులో విరివిగా అభివృద్ధి పనులు చేసుకోవచ్చన్నారు. వార్డుల్లో స్థానికులు పలు సమస్యలను రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఆయన వెంట పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు, కమిషనర్ వెంకట్రామయ్య, కౌన్సిలర్ కళ్యాణి, సుబ్బారావు, శంకరయ్య, జానకిరామయ్య, వహీదా, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ మారణకాండకు బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే

వెంకటగిరి, జులై 26, ప్రభాతవార్త: మణిపూర్‌లో కుకీ గిరిజన తెగకు చెందిన ఇద్దరు మహిళలను మే 4న నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారం సంఘటనను ఖండిస్తూ ఏపీ రైతు కూలీ సంఘం, స్త్రీ విముక్తి సంఘటనల ఆధ్వర్యంలో బుధవారం వెంకటగిరి పట్టణంలో నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.అజిత మాట్లాడుతూ మణిపూర్ మహిళలపై అమానవీయ దౌర్జన్యకాండకు కారకులైన వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం దోషులకు వత్తాసుగా నిలబడడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రపతి ద్రౌపది జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వి.రమణయ్య మాట్లాడుతూ మణిపూర్‌లో జాతుల మధ్య ఉన్న ఘర్షణలను కేంద్ర, రాష్ట్ర బీజేపీ పాలకులు మతవిద్వేషాలుగా పెంచి పోషించడంలో మునిగి తేలుతున్నారన్నారు.

## తాజుద్దిన్ సేవలు స్ఫూర్తిదాయకం : డీఎస్పీ



గూడూరు, జూలై 26 ప్రభాతవార్త : దేశానికి విశేష సేవలు అందించిన అబ్దుల్‌కలాం పేరుతో ఛారిటబుల్ ట్రస్ట్ స్థాపించి సేవా కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాలలో డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలామ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అండర్-15 విభాగంలో చదరంగం పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలను డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ అబ్దుల్ కలాం సాధారణ కుటుంబంలో జన్మించి ఎంతో కష్టపడి చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగి దేశానికి విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించేందుకు నిరంతరం కష్టపడాలని సూచించారు. అబ్దుల్ కలాం పేరుతో ట్రస్ట్ స్థాపించి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. అనంతరం చదరంగం పోటీల్లో 12 ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంకు మంత్రి పెద్దిరెడ్డి శంకుస్థాపన

వి.కోట, జూలై 26 ప్రభాతవార్త : మండలంలోని కస్తూరినగరం వద్ద సుమారు 38 కోట్లతో ఏర్పాటు చేయనున్న 132/33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంకు బుధవారం రాష్ట్ర అటవీ,గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. మండలంలో లో ఓల్టేజ్ సమస్య పరిష్కారంతో పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని కొత్త సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపి రెడ్డెప్ప, నేతలు కృష్ణమూర్తి, రెడ్డెప్ప, బాలగురునాథ్, గోపిరెడ్డి, తమీమ్, సుబ్రమణ్యం, కిషోర్ గౌడు, హరినాథ్, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగమ్మకు మోహిత్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పణ



తిరుపతిరూరల్, జూలై26 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం బ్రాహ్మణపట్టు గ్రామ పంచాయతీ పరిధిలో పాతూరు గ్రామంలో నడివీధి గంగమ్మ జాతర వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం చంద్రగిరి వైకాపా ఎమ్మెల్యే చెవిరెడ్డి మోహిత రెడ్డి గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు. గంగమ్మ ఆలయంలో మోహిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్వాహకులు మోహిత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపట్టు గ్రామ సర్పంచ్ నాగ జ్యోతి, వైకాపా సీనియర్ నేత సుబ్రమణ్యంరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మునస్వామిరెడ్డి, వైకాపా నాయకులు దొరస్వామి యాదవ్, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 2023 పోటీల నిర్వహణ జిల్లాలో విజయవంతం చేయాలి : కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, జులై 26 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2023 పోటీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ సంయుక్తంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుండి 31వ తేది వరకు శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు నిర్వహిస్తున్న నేపథ్యంలో కార్యక్రమం విజయవంతం కావాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఉదయం ఉమ్మడి చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆనంద రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. రామకృష్ణయ్య సూచనల మేరకు ట్రెజరర్ శివయ్య, అసోసియేషన్ సభ్యులు మునిస్వామి రిటైర్డ్ మేనేజర్ ఆంధ్రా బ్యాంక్ తదితర సభ్యులు, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్ జిల్లా కలెక్టర్‌ని కార్యక్రమ ముగింపు సభ ముఖ్య అతిథిగా ఆహ్వానించగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2023 పోటీలలో వివిధ జిల్లాల నుండి వచ్చే క్రీడాకారులకు పోటీల నిర్వహణ తిరుపతి జిల్లాలో నిర్వహించడం ఎంతో సంతోషించదగిన విషయమని, కార్యక్రమం విజయవంతం కావాలని తెలిపారు.

## ఫ్రీ లెఫ్టుల పనులను పరిశీలించిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జులై 26 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలో మ్యూజిక్ కళాశాల, టౌన్ క్లబ్ ఫ్రీ లెఫ్టుల వద్ద చేపట్టిన సుందరీకరణ పనులనుబుధవారం తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పరిశీలించారు. బాలాజీ కాలనీ సర్కిల్ మ్యూజిక్ కళాశాల ఫ్రీ లెఫ్ట్ వద్ద ఏర్పాటు చేస్తున్న సంగీత వాయిద్య పరికరాలను వుంచడం ద్వారా ప్రజల్లో సంగీత భావన పెంపొందించవచ్చానే భావనతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అక్కడే క్యాంపస్ స్కూల్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఐలాండ్‌లో కూడా గ్రీనరిని పెంపొందించి, పౌంటెన్ ఏర్పాట్లకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. అదేవిధంగా టౌన్ క్లబ్‌సర్కిల్ ఫ్రీ లెఫ్టులో గోడపై అతిపెద్ద అలిపిరి గాలి గోపురం చిత్రాన్ని వేయించడం జరిగిందన్నారు. ఫ్రీ లెఫ్టుల వద్ద పనులను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, హనుమంత్ నాయక్, కోఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా కార్గిల్ దినోత్సవం



తిరుపతి (క్రీడా), జులై 26 ప్రభాతవార్త : తిరుపతిలోని కపిల్ తీర్థం వద్ద గల అమరవీరుల స్థూపంకు పుష్పాలంజలి ఘటించి అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపినాథ్ రెడ్డి, బిజెపి తూర్పు మండల ఉపాధ్యక్షుడు తొండమనాడు సుబ్రమణ్యం రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ రెడ్డి, మైనారిటీ మోర్చా బిజెపి జిల్లా అధ్యక్షులు మస్తాన్ బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా మాజీ ఉపాధ్యక్షులు కట్టమంచి చంద్రబాబు యాదవ్, నాయకులు కొట్టే సుబ్రమణ్యం రెడ్డి, కేశవ్ పాల్గొన్నారు.

## కుళాయిపన్నులు చెల్లించని వారికి నీళ్ళు కట్

శ్రీకాళహస్తి, జులై 26 ప్రభాతవార్త : పురపాలక సంఘ కమిషనర్ బాలాజీనాయక్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఇంటిపన్నులు, ఖాళీ స్థలాల పన్నులు మరియు కుళాయిపన్నులు బకాయిలు అధికంగా ఉన్నందున సదరు బకాయిలు వసూలు చేసేందుకు పురపాలక సిబ్బంది మరియు సచివాలయ సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ప్రజలకు చైతన్యపరచి అవగాహన కల్పించారు. పన్నులను సకాలంలో చెల్లించకపోతే ప్రతినెలకు అపరాధ రుసుముతో పాటు చెల్లించాల్సి వస్తుందని ప్రజలకు తెలిపారు. అలాగే కుళాయి పన్నులు అధికంగా ఉన్న వారి ఇళ్ళకు కనెక్షన్లు తొలగించినట్లు కమిషనర్ బాలాజీనాయక్ తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి పియంవి.నారాయణరెడ్డి, ఆర్ఐలు రవికాంత్, బాలచంద్ర, ఇంజనీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, జూలై 26 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు బుధవారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు హైదరాబాద్ నేతాజీనగర్‌కు చెందిన శ్రీనివాస్ కుమార్ అనే భక్తుడు 1,00,116 రూపాయలను చెక్ రూపంలో విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ,ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఉన్నా లేకున్నా ప్రజలకు అండగా చంద్రబాబు : ఎమ్మెల్సీ



కుప్పం, జూలై 26 ప్రభాతవార్త : ప్రభుత్వం ఉన్నా లేకున్నా ప్రజలకు తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్సీ, కుప్పం తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని వైకాపాకు ప్రతిపక్ష హోదా సైతం దక్కదని పేర్కొన్నారు. చంద్రబాబు సతీమణి ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి చేతుల మీదుగా కుప్పంలో ఆగస్టు మొదటి వారంలోగా మొబైల్ మెడికల్ వ్యాన్‌ను ప్రారంభిస్తారన్నారు. ఈసందర్భంగా తెలుగుమహిళలతో మహాశక్తి పథకం, తెలుగుయువత సైకిల్ యాత్రపై చర్చిస్తారన్నారు. లక్ష మెజార్టీ లక్ష్యం పాటల ఆడియో క్యాసెట్లను ఆవిష్కరిస్తామన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఇప్పటికే వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. కుప్పంలో ఎన్టీఆర్ సుజల ద్వారా 2లకే నీటిని అందించాలని జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్లాంట్లను ఏర్పాటుచేస్తే నేడు అతీగతీ లేకుండా పోయిందన్నారు. తెదేపా అధికారంలో వస్తే కుప్పంకు కొన్ని ఎలక్ట్రానిక్ పరిశ్రమలు తెచ్చే లక్ష్యంతో నారా లోకేష్ ఉన్నారన్నారు. తొంభై శాతం పూర్తయిన హంద్రీ-నీవా పనులను వైకాపా ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కుప్పంలో కేవలం చంద్రబాబుపై విమర్శలు చేస్తే ప్రచారం వస్తు ందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌లు మాట్లాడడం సబబు కాదన్నారు. కుప్పానికి చంద్రబాబు ఏం చేశారో శిలాఫలకాలే జవాబు చెబుతాయన్నారు. సాక్షాత్తూ ఎమ్మెల్సీ భరత్ ఇంటి ముందర రోడ్లు గుంతలుగా మారితే దాన్ని సరిదిద్దలేక పోయారన్నారు. కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజార్టీ ఇస్తామని ప్రజలే చెబుతున్నారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్సీ భరత్‌ను మంత్రి ఆపై ముఖ్యమంత్రి చేస్తామని చెప్పారని కొనా ్నళ్లు పోతే ప్రధాని చేస్తారేమోనని వ్యాఖ్యలు చేశారు. సమావేశంలో టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, నేతలు కన్నన్, మంజునాథ్, ఆర్ముగం, తెలుగుమహిళ అనసూయ, సుగుణమ్మ పాల్గొన్నారు.